# ఎస్సెస్సీ స్పాట్‌లో నిబంధనలు బేఖాతర్



- 30 శాతానికిపైగా అదనంగా నియామకం
- ఆరుగురు హెచ్‌ఎంలకు లైజనింగ్, నోడల్ ఆఫీసర్ల బాధ్యతలు
- డీఈవోపై కలెక్టర్‌కు ఫిర్యాదు

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న పదో తరగతి జవాబుపత్రాల మూల్యాంకనం (స్పాట్)లో నిబంధనలను పాటించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా విద్యాధికారి సీహెచ్‌వీఎస్ జనార్ధన్‌రావు వైఖరితో మూల్యాంకన కేంద్రం గందరగోళంగా మారిందని, స్పాట్‌లో పాల్గొంటున్న ఉపాధ్యాయులు మనోవేదనకు గురవుతున్నారని ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా విమర్శిస్తున్నాయి. కరీంనగర్ స్పాట్ కేంద్రానికి రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 2,13,461 జవాబుపత్రాలను మూల్యాంకనం కోసం వచ్చాయి. వీటిని ఈనెల 7 నుంచి 15వ తేదీ వరకు తొమ్మిది రోజుల్లో మూల్యాంకనం చేయాల్సి ఉంది. ఇందుకు 99 మంది చీఫ్ ఎగ్జామినర్స్ (సీఈ), 593 మంది ఏఈలు, స్పెషల్ అసిస్టెంట్స్ 198 మంది అవసరం. డీఈవో 139 మంది సీఈలు, 732 మంది ఏఈలు, మొత్తం 971 మందిని, ప్రతి మండలం నుంచి 20 మంది చొప్పున 300 మందిని స్పెషల్ అసిస్టెంట్లుగా నియమించినట్లు తెలిసింది. 30 నుంచి 40 శాతం అధికంగా సిబ్బందిని నియమించినట్లు సమాచారం.

**● అర్హత లేకున్నా..**

బార్ కోడ్ స్కానింగ్‌ను నాన్ టీచింగ్ సిబ్బందితో చేయించుకోవలసి ఉండగా పదుల సంఖ్యలో ఉపాధ్యాయులను నియమించారు. దీంతో వారికి వేసవి సెలవుల్లో అర్జిత సెలవులు జమవుతాయి. ఇది పూర్తిగా నిబంధనలకు విరుద్ధమని ఉపాధ్యాయ సంఘాలు అంటున్నాయి. అయిదారుగురు హెడ్మాస్టర్లకు స్పాట్‌లో లేని పోస్టులు లైజనింగ్ ఆఫీసర్స్, నోడల్ ఆఫీసర్స్ నియమించారని, ఇది కూడా సరికాదని చెబుతున్నారు. మూడు సంవత్సరాలు వరుసగా పదోతరగతికి బోధించని ఉపాధ్యాయు లను ఈఈలు, సీఈలుగా నియమించారని విమర్శిస్తున్నాయి. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ఉపాధ్యాయులకు, దివ్యాంగులకు కూడా స్పాట్ డ్యూటీలను వేశారని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి. మినహాయింపు కోరినా విడుదల చేయకుండా నాలుగైదు రోజులుగా స్పాట్ సెంటర్ చుట్టూ తిప్పుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. అనారోగ్యం కారణంగా విధులకు హాజరుకానీ వారికి మెమోలు, షోకాజు నోటీసులు, జీతాల్లో కోత విధించాలని హెచ్‌ఎంలకు ఆదేశాలు ఇస్తూ డీఈవో ఉపాధ్యాయులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఉపాధ్యాయ సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు.

**డీఈవోపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి - డీటీఎఫ్**

నిబంధనలకు పాటించకుండా ఇష్టారాజ్యంగా స్పాట్‌ను నిర్వహిస్తూ ఉపాధ్యాయులను తీవ్ర మనోవేదనకు గురిచేస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి సిహెచ్ జనార్ధన్‌రావు చర్యలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డీటీఎఫ్ జిల్లాశాఖ కలెక్టర్‌కు, రాష్ట్ర పరీక్షల డైరెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. డీఈవో అవగాహన రాహిత్యం, అహంకార ధోరణతో వ్యవహరిస్తూ ఉపాధ్యాయులను భయభ్రాంతులకు గురిచేస్తూ తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైద్యుల రాజిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఆవాల నరహరి, ప్రధాన కార్యదర్శి తూముల తిరుపతి ఆరోపించారు. అనారోగ్యం, దివ్యాంగులు విధులు నిర్వహించలేక రిలీవింగ్ కోసం స్పాట్ కేంద్రంలో వేచి ఉన్నవారిని వెంటనే రిలీవ్ చేయాలని డిమాండ్ చేశారు.



ఈ ఆటో నడుపుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

## మహిళా సాధికారతే లక్ష్యం

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ
- మహిళా ప్రాంగణంలో ఈ ఆటో డ్రైవింగ్ శిక్షణ ప్రారంభం

తిమ్మాపూర్, ఏప్రిల్ 12, (ఆంధ్రజ్యోతి): మహిళలను ఆర్థికంగా బలోపేతం చేస్తూ మహిళా సాధికారతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మోవో స్వొసైటీ సహకారంతో మండలంలోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా శిశు వికాస కేంద్రంలో మహిళలకు ఎలక్ట్రికల్ ఆటో డ్రైవింగ్‌లో శిక్షణను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు స్వయం ఉపాధి కల్పించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంకల్పమని



ఎల్‌ఎండిలోని మహిళ ప్రాంగణంలో పలు శిక్షణలు తీసుకున్న మహిళలకు సర్టిఫికేట్‌లను అందజేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, రాష్ట్ర మహిళా కార్పొరేషన్ చైర్ పర్సన్ శోభారాణి

తెలిపారు. ఈ ఆటో డ్రైవింగ్‌లో మహిళలకు శిక్షణ ఇచ్చి వారికి ఆటో కొనుగోలు కోసం పెట్టుబడి సాయం చేస్తామన్నారు. రాష్ట్ర మహిళా కార్పొరేషన్ చైర్‌పర్సన్ శోభారాణి మాట్లాడుతూ మహిళలు విభిన్న రంగాల్లో రాణించాలనే ఉద్దేశంతో డ్రైవింగ్‌లో శిక్షణ ప్రారంభించామని తెలిపారు. రానున్న రోజుల్లో మొబైల్, టీవీ, మోటార్ రంగంలోనూ మహిళలకు శిక్షణ ఇస్తామన్నారు. కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ మహిళలకు పురుషులతో సమానంగా అవకాశాలు కల్పిస్తామన్నారు. అనంతరం మహిళా ప్రాంగణంలో శిక్షణ పూర్తి చేసుకున్నవారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పమేలా సత్పతి ఆటో నడపగా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, రాష్ట్ర మహిళా కార్పొరేషన్ చైర్ పర్సన్ శోభారాణి ఆటోలో కూర్చుని కొద్ది దూరం వెళ్లారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, మోవో సంస్థ ప్రతినిధి జైభారతి, జిల్లా సంక్షేమ అధికారి సబిత, మహిళా ప్రాంగణం జిల్లా మేనేజర్ సుధారాణి, సీఎ శ్రీలత, జీఎం సుభద్ర పాల్గొన్నారు.


'ఐసర్'తో బంగారు భవిష్యత్
• ఇంటర్ విద్యార్థులకు ప్రవేశం
• ఐదేళ్ల బీఎస్-ఎంఎస్ ఇంటిగ్రేటెడ్ కోర్సులు
8

దాగుడు మూతలు.. దండాకోర్..
• కానరాని గ్రామీణ క్రీడలు
9


# ఏడాది పాటు బీఆర్ఎస్ రజతోత్సవాలు

- లక్షలాది మందితో ఎల్కతుర్తిలో భారీ బహిరంగ సభ
- ఉమ్మడి జిల్లానుంచి పెద్ద ఎత్తున తరలిరావాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): నాటి టీఆర్ఎస్, నేటి బీఆర్ఎస్ పార్టీ స్థాపించి 25 ఏళ్ల పూర్తి చేసుకుంటున్న సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవాలను ఏడాదిపాటు నిర్వహిస్తామని ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీ రామారావు అన్నారు. శనివారం ఆయన చింత కుంటలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో రజతోత్సవంపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావును సీట్లో కూర్చోబెట్టి అభినందించారు. ఇప్పటి నుంచి జిల్లా కార్యాలయం నుంచే పార్టీ కార్యాకలాపాలు నిర్వహించాలని సూచించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేటీ రామారావు



జీవీ రామకృష్ణారావును అభినందిస్తున్న మాజీ మంత్రి కేటీఆర్, గంగుల కమలాకర్

మాట్లాడుతూ ఈయేడాది బీఆర్ఎస్ పార్టీకి కీలకమని అన్నారు. ఈనెల 27న వరంగల్‌కు సమీపంలోని ఎల్కతుర్తిలో లక్షలాది మందితో ఏర్పాటు చేస్తున్న బీఆర్ఎస్ రజతోత్సవానికి ఉమ్మడి జిల్లానుంచి తరలివచ్చేందుకు సిద్ధమవుతున్నారని చెప్పారు. మార్చి 12న సభకు అనుమతి ఇవ్వాలని పోలీసులను కోరితే ఇప్పటి వరకు ఇవ్వలేదని, దీంతో కోర్టును ఆశ్రయించామన్నారు. 1250 ఎకరాల స్థలంలో సభ నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని, 1000 ఎకరాల్లో పార్కింగ్ స్థలం ఏర్పాటు చేశామని చెప్పారు. ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున 10 లక్షల వాటర్ ప్యాకెట్లు, 10 లక్షల మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేస్తామని చెప్పారు. సభా ప్రాంగణంలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తామన్నారు. రెండు వేల మంది వలంటీర్లను నియమించామని చెప్పారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ దొందూ దొందేనని, ఈ రెండు పార్టీలు కలిసి కేసీఆర్‌ను బదనాం చేసేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఎన్నటికీ సాగవని అన్నారు. యాసంగిలో ఉమ్మడి జిల్లాలో చాలా మేరకు పంటలు సాగునీరందక ఎండిపోయాయన్నారు. దెబ్బతిన్న మేడిగడ్డ పిల్లర్‌ను రిపేర్ చేసేందుకు కాంట్రాక్టర్ సిద్ధంగా ఉన్నారని, ఈ వేసవిలో మరమ్మతులు చేయించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ పాలనలో మండుతున్న ఎండల్లో సైతం చెరువులు, కుంటలు, డ్యామ్‌లు, కాలువలు మత్తళ్ల దూకేవని, ప్రస్తుత ప్రభుత్వం కేసీఆర్‌పై ద్వేషంతో పంటలు ఎండిపోతున్నా పంట్టిచుకోవడం లేదని విమర్శించారు. హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూమిని తాకట్టు పెట్టామని టీపీసీసీ అధ్యక్షుడు చెబుతుంటే, కుదవపెట్టలేదని మంత్రులు, ముఖ్యమంత్రి చెబుతున్నాన్నారు. ఈ భూవివాదం దేశంలోనే అది పెద్ద మోసమని కేటీఆర్ మండిపడ్డారు. ఈ భూమిని ఎవరు కొన్నా 2028లో తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంచు భూమిని కూడా వదిలిపెట్టకుండా తీసుకుంటామని హెచ్చరించారు. అమృత్‌నిధుల్లో అవినీతి జరిగిందంటూ కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేసినా కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్ వాటిపై విచారణ జరిపించకుండా కాంగ్రెస్ ప్రభుత్వానికి సహాయపడుతున్నారని విమర్శించారు. మే నెలలో సభ్యత్వ నమోదు, దసరా వరకు సంస్థాగత కమిటీల ఏర్పాటు, ప్రతి నియోజకవర్గానికి 100 మంది చొప్పున కార్యకర్తలు శిక్షణ ఇచ్చేందుకు శిక్షణ తరగతులను నిర్వహిస్తామని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాల అవినీతి, అక్రమాలు, హామీలపై ప్రజల్లో ఎండగట్టడంతో పాటు టీఆర్ఎస్ ఆవిర్భావం, తెలంగాణ ఉద్యమం, బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తామని, ఈ యేడాది బీఆర్ఎస్‌కు కీలకమని అన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, డాక్టర్ సంజయ్, ఎమ్మెల్సీ ఎల్ రమణ, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు సుంకె రవిశంకర్, పుట్ట మధు, విద్యాసాగర్ రావు, రసమయి బాలకిషన్, వొడితెల సతీష్ బాబు, చల్మెడ లక్ష్మీనర్సింహారావు, జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే ధ్యేయం

- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం
- కురిక్యాలలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



గంగాధర మండలం కురిక్యాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కలెక్టర్ పమేలా సత్పతి

గంగాధర, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి ధ్యేయంగా పని చేస్తున్నామని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. శనివారం గంగాధర మండలం కురిక్యాలలో సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు విషయంలో రైస్ మిల్లర్లతో సమావేశం ఏర్పాటు చేసి తరుగు లేకుండా కొనుగోలు చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో రైతులకు నీడ, తాగునీరు వంటి సౌకర్యాల ను కల్పించాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో కురిక్యాల సింగిల్ విండో అధ్యక్షుడు తిరుమల్‌రావు, అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్, డీసీవో రమానుజాచార్య, సివిల్ సప్లయిస్ డీఎం రజనీకాంత్, నోడల్ అధికారి శివనాగేంద్ర, డీటీసీఎస్ ఉషారాణి, తహసీల్దార్ అనుపమ పాల్గొన్నారు.

**● రామడుగులో..**

రామడుగు: రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. శనివారం రామడుగు మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా తమ ప్రభుత్వం రైతు సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ 48 గంటల్లోగా రైతులకు ధాన్యం సొమ్ము వచ్చేలా వెంట వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్, వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ వీర్ల వెంకటేశ్వర్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మరవేణి తిరుమల తిరుపతి, ఎంపీడీవో రాజేశ్వరి, తహసీల్దార్ వెంకటలక్ష్మి, సింగిల్ విండో చైర్మన్ ఒంటెల మురళీకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో వీరహనుమాన్ విజయ యాత్ర

**● యాత్రను ప్రారంభించిన వీహెచ్‌పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ రాంసింగ్**

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలో చిన్నహనుమాన్ జయంతి సందర్భంగా విశ్వహిందూపరిషత్, భజరంగదళ్ ఆధ్వర్యంలో వీరహనుమాన్ విజయయాత్ర శనివారం నిర్వహించారు. గాంధీరోడ్ రామాలయం వద్ద వీహెచ్‌పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ రాంసింగ్ యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హిందూ ధర్మం కోసం ఏకీకృతం కావాలని అన్నారు. మన దేశం, సంస్కృతీ సాంప్రదాయలకోసం పాటుపడాలని పిలుపిచ్చారు. టవర్ సర్కిల్, ప్రకాశం గంజ్, రూరల్ పోలీస్ స్టేషన్, కమాన్, వన్ టౌన్ పోలీస్‌స్టేషన్, బస్టాండ్, గీతాభవన్, ఆర్అండ్‌బి గెస్ట్‌హౌజ్, కోర్ట్, మంచిర్యాల, గాంధీరోడ్ చౌరస్తాల మీదుగా ర్యాలీ తిరిగి గాంధీరోడ్ రామా లయం వద్దకు చేరుకుంది. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఇనుగంటి మధు సూదన్‌రావు, ఆదిమూలం విద్యాసాగర్, గో రక్షా రాష్ట్ర కమిటి మెంబర్ వుట్కూరి రాధాకృష్ణారెడ్డి, వీహెచ్‌పీ నగర అధ్యక్షుడు ఇనుగుర్తి రమేశ్, భజరంగదళ్ బాధ్యులు తోట ప్రదీప్, కన్నం శంకర్ పాల్గొన్నారు.



హనుమాన్ శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు



శోభాయాత్రలో హనుమాన్ విగ్రహం



శోభాయాత్ర బందోబస్తులో పాల్గొన్న సీపీ

**● పటిష్ట బందోబస్తు**

కరీంనగర్ క్రైం: హనుమాన్ జయంతి సందర్భంగా, వీరహనుమాన్ విజయ యాత్ర ర్యాలీకి పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశామని పోలీస్‌కమిషనర్ గౌస్ ఆలం తెలిపారు. ర్యాలీ సందర్భంగా బందోబస్తు విధుల్లో పాల్గొంటున్న పోలీసు అధికారులకు సీపీ బ్రీఫింగ్ చేశారు. దాదాపు 450 మంది పోలీసు అధికారులు బందోబస్తు విధుల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. సున్నితమైన ప్రాంతాల్లో స్టాటిక్ ఫోర్స్, స్ట్రైకింగ్ ఫోర్స్ రూఫ్‌టాప్, మొబైల్ పెట్రోలింగ్ పార్టీలను మోహరించినట్లు తెలిపారు. ర్యాలీ సందర్భంగా ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అవసరమైన అన్నిచోట్ల దారి మళ్లింపు చర్యలు తీసుకున్నామన్నారు.

# సూర్యరథంపై రామయ్య

ఇల్లందకుంట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట సీతా రామచంద్రస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. శనివారం స్వామివారు సూర్యరథం (చిన్నరథం)పై కొలువు దీరా రు. శనివారం రాత్రి ప్రత్యేక పూజ అనంతరం శకటోత్సవం నిర్వ హించారు. పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు ఎడ్ల బండ్ల ఆలయం తిరుమాడ వీధుల్లో ప్రదర్శన చేశారు. అర్చకులు స్వామి వారిని చిన్నరథంపై కొలువుదీర్చగా ఆలయ మాడ వీధుల మీదుగా ఊరేగించారు. సైదాబాద్ నుంచి వచ్చిన మేకల బండ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. స్వామివారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఇంగిలే రామారావు, ఈవో కందుల సుధాకర్, ధర్మకర్తలు పాల్గొన్నారు.



↑ స్వామివారిని రథంపైకి తీసుకొస్తున్న అర్చకులు,
సూర్య రథంపై కొలువుదీరిన స్వామివారు ↓





## నాలుగు దశాబ్దాలకు జనజీవన స్రవంతిలోకి..

● స్వగ్రామానికి చేరిన మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యురాలు



కాంకేట్ ఎస్పీ నుంచి విడుదల పత్రం అందుకుంటున్న కుటుంబ సభ్యులు

కోరుట్ల/కథలాపూర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పోరాటంలో నాలుగు దశాబ్దాలుగా వివిధహోదాల్లో పనిచేసి పోలీసుల ఎదుట లొంగిపోయిన మండలంలోని సిరికొండకు చెందిన బత్తుల గాంబాలు అలియాస్ పసుల వసంత శనివారం స్వగ్రామం చేరుకున్నారు. పీపుల్స్ వార్‌లో కోరుట్లకు చెందిన భర్త పసుల రాంరెడ్డితో కలిసి పలురాష్ట్రాల్లో కీలక పదవుల్లో కొనసాగారు. భర్త రాంరెడ్డి2001లో మద్దిమల్ల ఎన్‌కౌంటర్‌లో మరణించగా వసంత పార్టీలోనే కొనసాగారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని నార్త్ బస్తర్ డివిజన్ ఇన్‌చార్జిగా, ప్రాంతీయ ఆదివాసీ మహిళా సంఘటన్ సీవోగా, కేంద్ర కమిటీ సభ్యురాలిగా కొనసాగిన వసంత అనారోగ్య కారణాలతో గత ఏడాది సెప్టెంబరులో కాంకేర్ జిల్లా ఎస్పీ ఎదుట లొంగిపోయారు. పూర్తిస్థాయిలో కుటుంబసభ్యుల వివరాలు సేకరించిన పోలీసులు శనివారం కుటుంబసభ్యులకు విడుదలపత్రం అందజేస్తూ అప్ప గించారు. కూతురు భవానీ, మేనల్లుడు బత్తుల నరేశ్ కాంకేర్ వెళ్లి వసంతను స్వగ్రామానికి తీసుకువచ్చారు. దాదాపు నలభై సంవత్సరాల తర్వాత ఇంటికి చేరుకోవడం ఎంతో ఆనందంగా ఉందని మేనల్లుడు నరేశ్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి

మంథని, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పేకాట స్థావరంపై శనివారం పోలీసులు దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. పక్కాసమాచారంతో మంథని శివారులోని పోచమ్మగుడి సమీపంలో డబ్బులు పెట్టి పేకాటఆడుతున్న ఏడుగురిపై కేసునమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

## ఇప్పపల్లిలో మహిళ అదృశ్యం



దేవేంద్ర (ఫైల్)

కథలాపూర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇప్పపల్లిలో యాగండ్ల దేవేంద్ర(50) అనే మహిళ అదృశ్యమైంది. రెండు రోజుల కిందట ఇంటి నుంచి వెళ్లినదేవేంద్ర ఇంటికిరాకపోవడంతో కుటుంబసభ్యులు కలవరపడ్డారు. ఈక్రమంలో భర్త భూమయ్య శనివారం పోలీసులకు ఫిర్యాదుచేశారు. కొంతకాలంగా దేవేంద్ర కుటుంబం అప్పులబాధతో సతమతమవుతోందని స్థానికులు పేర్కొంటున్నారు.

# 'ఐసర్'తో IISER బంగారు భవిష్యత్తు



- కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏడు విద్యాలయాలు
- ఇంటర్ విద్యార్థులకు ప్రవేశం
- ఐదేళ్ల బీఎస్-ఎంఎస్ ఇంటిగ్రేటెడ్ కోర్సులు
- భవిష్యత్ శాస్త్రవేత్తలు, పరిశోధకులను తీర్చిదిద్దడమే లక్ష్యం

చొప్పదండి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): దేశంలో శాస్త్రవిద్యను ప్రోత్సహించడం, విద్యార్థులను భవి ష్యత్ శాస్త్రవేత్తలు, పరిశోధకులుగా తీర్చి దిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం ఐసర్ విద్యాలయాలను ఏర్పాటు చేసింది. ఐఐటీకి ధీటుగా సైన్స్ విద్యార్థుల కోసం ఐసర్ (ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎద్యు కేషనల్ రీసెర్చ్) విద్యాలయాలను కేంద్ర ప్రభుత్వం 2006లో ప్రారంభించింది. ప్రస్తుతం దేశంలో ఏడు విద్యాలయాలు ఉన్నాయి. ఈ విద్యాసంస్థలు శాస్త్ర రంగంలో అత్యుత్తమ విద్యను, పరిశోధన అవకాశాలను అందిస్తున్నాయి. ఇంటర్ తర్వాత ఎంపీసీ విద్యార్థు లకు ఐఐటీలో ప్రవేశాల మాదిరిగా బైపీసీ ఆధ్వర్యంలో ఐసర్‌లో ప్రవేశ పరీక్ష ద్వారా విద్యార్థులను చేర్చుకుంటాయి. ప్రస్తుతం ఐసర్‌లో ప్రవేశానికి ప్రక్రియ ప్రారంభమై నేపథ్యంలో ఆ వివరాలు విద్యార్థుల కోసం..





**● ముఖ్యమైన తేదీలు**

- విద్యార్థులు ఐసర్ పోర్టల్‌లో ఏప్రిల్ 15 లోగా దరఖాస్తులు సమర్పించుకోవాలి.
- దరఖాస్తుల్లో తప్పుల సవరణకు ఏప్రిల్ 21, 22న అవకాశం కల్పిస్తారు.
- హాల్‌టికెట్ల విడుదల మే 15
- ప్రవేశ పరీక్ష మే 25న నిర్వహిస్తారు.
- ఐసర్ పోర్టల్: www.iiseradmission.in

### ● బీఎస్, ఎంఎస్ డ్యుయల్ డిగ్రీ...

ఐఏటీ (ఐసర్ అప్టిట్యూడ్ టెస్ట్) ద్వారా ఇంటర్ సైన్స్ విద్యార్థులను ప్రవేశ పరీక్ష ద్వారా విద్యాల యంలో ప్రవేశం కల్పిస్తారు. బీఎస్, ఎంఎస్ (బ్యాచిలర్ ఆఫ్ ఐన్స్, మాస్టర్ ఆఫ్ సైన్స్) ఐదేళ్ల కోర్సును ఆఫర్ చేస్తున్నారు. మొదటి రెండు సంవత్సరాలు ఫౌండేషన్ కోర్సు ఉంటుంది. ఫిజిక్స్ మ్యాథ్స్ కెమిస్ట్రీ, బయోలజీ సబ్జెక్టుల్లో విద్యా బోధన చేస్తారు. తర్వాత రెండు సంవత్సరాల్లో వి ద్యార్థి తనకు ఇష్టమైన సబ్జెక్టులో స్పెషలైజేషన్ ఎంచుకోవాలి. చివరి ఏడాది రీసెర్చ్ ప్రాజెక్టు ఉంటుంది.

### ● ప్రవేశ పరీక్ష...

ఐసర్‌లో ప్రవేశానికి మూడు మార్గాలు ఉం టాయి. కేవీపీవై, ఐఐటీ, జేఈఈ అడ్వాన్స్‌డ్ చానల్ (ఐఐటీలో మంచి ర్యాంకు వచ్చిన విద్యార్థులకు అవకాశం ఉంటుంది). ప్రధానంగా ఐసర్ యాప్టిట్యూడ్ టెస్ట్‌ను నిర్వహించి విద్యార్థులను మెరిట్, కేటగిరీ ద్వారా ఎంపిక చేస్తారు. ఇంటర్‌లో పీసీఎంబీ (ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్, బయోలజీ) సబ్జెక్టులు చదివిన విద్యార్థులు ప్రవేశ పరీక్షకు అర్హులు. పదో తరగతిలో 60 శాతం మార్కులు సాధించాలి. ఎస్సీ, ఎస్టీలకు 55 శాతం మార్కులు ఉండాలి. ప్రవేశ పరీక్షలో 60 ప్రశ్నలు ఉండగా ఒక్కో సబ్జెక్ నుంచి 15 ప్రశ్నలు ఉంటాయి. ప్రతి జవాబుకు నాలుగు మార్కులు ఉంటాయి, తప్పు సమాదానికి 1 మైనస్ మార్కు ఉంటుంది. మొత్తం 240 మార్కులకు పరీక్ష ఉంటుంది.

### ● దేశంలో ఏడు విద్యాలయాలు..

దేశంలో ఏడు ఐసర్ విద్యాలయాలను కేంద్ర ప్రభుత్వం స్థాపించింది. ఐసర్ పూణే, కలకత్తా, మొహాలీ, భోపాల్, తిరువనంత౼పురం, తిరుపతి, బరంపురంలో విద్యాలయాలు ఉన్నాయి. దేశంలో మొత్తం 2,363 సీట్లు ఉండగా తిరుపతి ఐసర్‌లో 350 సీట్లు, బరంపురం 300, భోపాల్ 300, తిరువనంతపురం 320, పుణే 288, కలకత్తా 280, మొహాలీలో 270 సీట్లు ఉన్నాయి. ఇవి కాకుండా భోపాల్ ఐసర్‌లో బీటెక్ విభాగంలో 140 సీట్లు, ఎకనామిక్స్‌లో 50 సీట్లు ఉన్నాయి. ఐసర్‌లో టాప్ లెవల్ సైన్స్ విద్యను ఫ్యాకల్టీ అందిస్తుండగా, ఉన్నతస్థాయి ల్యాబ్‌లు, అంతర్జాతీయ సంస్థలు అనుసంధానం, రీసెర్చ్ అవకాశాలను కల్పిస్తున్నాయి. విద్యార్థులకు ఇన్‌స్పైర్ స్కాలర్‌షిప్‌లను అందజేస్తూ అధునాతనమైన హాస్టల్ వసతిని విద్యాసంస్థలు కల్పిస్తున్నాయి.

## వంతెనపై భారీ వాహనాలు ఢీ

● క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్ ● సురక్షితంగా బయటకు తీసిన స్థానికులు



ప్రమాదానికి గురైన భారీ వాహనాలు

కోరుట్లరూరల్ (మెట్‌పల్లిటౌన్), ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి పట్టణంలోని ఎస్సారెస్పీ ప్రధాన కాల్వ జాతీయ రహదారిపై ఉన్న వంతెనపై రెండు భారీవాహనాలు ఎదురెదురుగా ఢీకొట్టుకున్నాయి. వంతెనపై భారీ వాహనాలు ఢీకొట్టుకోగా వాహనంలోని క్యాబిన్‌లో లారీ డ్రైవర్ ఇరుక్కున్నాడు. గమనించిన స్థానికులు అతి కష్టంమీద బయటకు తీసి చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న సీఐ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం ఎస్ఐలు భారీ వాహనాలను ఎక్స్‌కావేటర్ సహాయంతో తొలగించి రాకపోకలు పునరుద్ధరించారు. అప్పటి వరకు జాతీయ రహదారిపై భారీగా వాహనాలు నిలిచి పోయాయి.

## తొలితరం కమ్యూనిస్టు యోధుడిని కోల్పోయాం



కాంతారావుకు నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

ఎలిగేడు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు, కమ్యూనిస్టు పార్టీ తొలితరం నాయకుడిని కోల్పోయిందని సీపీఐ జాతీయకమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడవెంకటరెడ్డి అన్నారు. సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన సీపీఐ నాయకుడు తానిపర్తి కాంతారావు ఇటీవల మృతిచెందగా ఆయన కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ తొలితరం కమ్యూనిస్టు నాయకుడని, మంచి ఆదర్శ భావాలున్న వ్యక్తి అని కొనియాడారు. ఆదర్శ కమ్యూనిస్టుగా జీవించడం గొప్పవిషయంగా చెప్పుకొచ్చారు. వారిత్యాగాలు, జీవిత విశేషాలు నేటి కమ్యూనిస్టు నాయకులు ఆదర్శంగా తీసుకొని పనిచేయాలని సూచించారు. 30ఏళ్లపాటు సర్పంచ్‌గా పనిచేసి పేద, అట్టడుగువర్గాల సంక్షేమానికి నిరంతరం కృషిచేశారన్నారు. రాష్ట్రకార్యవర్గ సభ్యుడు కలవేణశంకర్, జిల్లాకార్యదర్శులు తాండ్రసదానందం, మేకలదాస్, జిల్లా ఏఐటీయుసీ ప్రధానకార్యదర్శి కడారి సునీల్, మాజీసర్పంచ్ అర్షనపల్లి వెంకటేశ్వర్ రావు, నాయకులుతానిపర్తిమోహన్ రావు, ఆయన కటుంబసభ్యులు పాల్గొన్నారు.

## వరుస దొంగతనాలతో వణికిపోతున్న అన్నారం గ్రామస్థులు

● రాత్రివేళ గస్తీ తిరుగుతున్న యువకులు

● పోలీసులకు సవాలుగా మారిన దొంగతనాలు

మానకొండూర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారం గ్రామంలో వరుస దొంగతనాలతో గ్రామస్థులు వణికిపోతున్నారు. మార్చి 25న అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నాలుగు ఇళ్లలో చొరబడి నగదు, బంగారు, ఆభరణాలు, మోటార్‌సైకిల్‌ను ఎత్తుకెళ్లిన విషయం తెలిసిందే. ఏప్రిల్ 9న అర్ధరాత్రి గ్రామ సమీపంలోని వరాహగుట్ట ఆంజనేయస్వామి ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడి స్వామివారి హుండీని పగులకొట్టి నగదు అందులోని నగదు, స్వామివారి వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. 15రోజులలో రెండు వరుస దొంగతనాలు జరగడంతో గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు. గతనెల 25న ఒకేరోజు గొట్టిముక్కల విజయ, మధునాల వెంకటమ్మ, రుద్రోజు వెంకటాచారి ఇంటి తాళాలు పగులకొట్టి నగదు, నగలు, పాకాల రాజిరెడ్డి ఇంటి ముందు పార్కు చేసిన మోటార్ సైకిల్‌ను ఎత్తుకెళ్లారు. ఇలా వరుస దొంగతనాలతో రాత్రి వేళలో యువకులు కర్రలను పట్టుకొని వీధులలో గస్తీ తిరుగుతున్నారు. ఇప్పటికి 18రోజులైనా దొంగలు పట్టుబడక పోవడం పోలీసులకు సవాలుగా మారింది.

## రైస్‌మిల్లులో అగ్నిప్రమాదం

● కాలిబూడిదైన ధాన్యం, గోనె సంచులు



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్, 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండ్రికర్ల గ్రామంలోని మహాలక్ష్మి రైస్‌మిల్లులో శనివారం తెల్లవారు జామున అగ్నిప్రమాదం జరిగింది. ప్రమాదంలో సుమారు రెండుకోట్ల రూపాయల ఆస్తినష్టం వాటిల్లిందని యజమాని గంగారెడ్డి తెలిపారు. శనివారం వేకువజామున ప్రమాదవశాత్తు రైసు మిల్లులో నుంచి దట్టమైన పొగతో కూడిన మంటలు రావడాన్ని అక్కడే ఉన్న కూలీలు గమించి యజమాని గంగారెడ్డితో పాటు అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. వెంటనే సంఘటన స్థలానికి అగ్నిమాపకసిబ్బంది చేరుకొని మంటలార్పి వేశారు. రైసుమిల్లు షెడ్‌తో పాటు సుమారు ఐదు వేల క్వింటాళ్ల ధాన్యం, 80వేల పాత, 10వేల కొత్త గోనె సంచులు కాలి బూడిదైనట్లు యజయాని తెలిపారు. దీంతో సుమారు రెండు కోట్ల విలువైన ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు ఆవేదన చెందారు. రైస్‌మిల్లును సివిల్‌సప్లయి అధికారులు, ఆర్ఐ ఉమేష్ పరిశీలించి ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు.

## హత్యాయత్నం కేసులో ఆరుగురి అరెస్ట్

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఆస్తి తగాదా విషయమై హత్యాయత్నం కేసులో సిరిసిల్ల పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన కలికోట పృథ్వి(23), కలికోట రేణుక(39), ఎల్లారెడ్డిపేట మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన పాతూరి సాయికృష్ణ(34), సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన నక్క వెంకటేశ్(24), ఎల్లారెడ్డిపేట మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన పేయింటర్ సృజన్(21), సిరిసిల్ల పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన పెయింటర్ కనకం నరేశ్(38)లను శనివారం రాత్రి అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని సిరిసిల్ల టౌన్ సిఐ కె. కృష్ణ తెలిపారు. నిందితుల వద్ద ఒక కత్తి , ఆరు మొబైల్ ఫోన్స్, ఒక మోటార్ సైకిల్, ఒక కారును సీజ్‌చేశామని ఆయన తెలిపారు. సీఐ వివరాల ప్రకారం... కలికోట రేణుక తన మరిది వెంకటేశ్‌కు మధ్య ఇంటి దారి విషయమై గత కొద్దిరోజుల నుంచి గొడవలు జరుగుతున్నాయి. రేణుక చిన్న కొడుకు పృథ్వి ఎల్లారెడ్డిపేటకు చెందిన పాతూరి సాయికృష్ణ అనే పెయింటింగ్ కాంట్రాక్టర్ వద్ద సూపర్‌వైజర్‌గా పనిచేస్తుం డేవాడు. రేణుక భర్త చనిపోవడంతో కాంట్రాక్టర్ సాయికృష్ణకు రేణుక సాన్నిహిత్యం పెరిగింది. రేణుక తన మరిది వెంకటేశ్ మధ్య గొడవలు జరుగుతుండటంతో వెంకటేశ్‌ను అతని కుటుంబాన్ని పృథ్విచేత చంపించాలని సాయికృష్ణ, రేణుక కలిసి పథకం వేశారు. ఈ పథకంలో భాగంగానే తన మరిదితో దారి విషయం గొడవ ఉందని, ప్రతి రోజు తనను బూతులు తిడుతున్నారని వెంకటేశ్ కుటుంబాన్ని చంపివేస్తే ఇల్లు , స్థలం మనకే వస్తుందని కుమారుడు పృథ్విని పురమాయించారు. ఇందుకు రేణుక, సాయికృష్ణలు కలిసి పృథ్వి తన స్నేహితులైన కనకం నరేశ్, సృజన్, వెంకటేశ్‌లకు మద్యం తాగించి తన బాబాయ్ కుటుంబాన్ని అంతమొందించాలని పథకం ప్రకారం ఈ నెల 8న కత్తితో పొడిచి హత్యాయత్నం చేశాడు. ఈ సంఘటనపై కేసు నమోదుచేసి ఆరుగురు నిందితు లను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.

## భయభ్రాంతులకు గురిచేస్తున్న వ్యక్తి అరెస్ట్

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలో పెద్ద కత్తి పట్టుకొని ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న ఇప్పలపల్లి గ్రామానికి చెందిన సలేంద్రి రాకేశ్(26) అనే వ్యక్తిని శనివారం రాత్రి అరెస్ట్ చేశామని టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. ఇతని వద్ద ఒక పెద్ద కత్తి, చిన్న బటన్ చాక్, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కూలి చేసుకుంటే జీవించే రాకేశ్ తాగుడుకు బానిసై గతంలో వేములవాడలో దొంగతనాలకు పాల్పడగా జైలుకు వెళ్లి వచ్చాడని తెలిపారు. మళ్లీ సిరిసిల్లలో తిరుగుతూ భయానక వాతావరణ సృష్టించాలని కరీంనగర్‌లో పెద్ద కత్తి కొనుగోలుచేసి ద్విచక్రవాహనంలో పెట్టుకొని తిరుగుతూ ప్రజలకు భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని ఫిర్యాదు రావడంతో కేసు నమోదుచేసి అతడిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

## షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

● పేలిన వంటగ్యాస్ సిలిండర్



ఇంట్లో నుంచి వస్తున్న పొగలు

కథలాపూర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండలం లోని సిరికొండలో సుద్దాల బుచ్చిరాజు అనే మహిళకు చెందిన ఇల్లు షార్ట్ సర్క్యూట్‌తో శనివారం దగ్ధమైంది. కొన్నేళ్ల క్రితం బిగించిన విద్యుత్‌వైర్లు సరిగా లేకపోవడంతో షార్ట్‌సర్క్యూట్‌కు కారణమైంది. మంటలు వ్యాపించడంతో ఇంట్లో ఉన్న వంటగ్యాస్ సిలిండర్ పేలి పైకప్పు లేచిపోయింది. ఈ ఘటనతో స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. మంటలు అదుపులోకి రాకపోవడంతో ఫైరింజన్‌కు సమాచారం అందించగా సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు. ఇంట్లో ఉన్న నిత్యావసర వస్తువులు, దుస్తులు, ఇతరత్రా సామగ్రి పూర్తిగా కాలిబూడిదైంది. పక్క ఇంట్లో ఉన్న ఆశా కార్యకర్తకు చెందిన రిజిస్టర్లు కాలిపోయాయి. మరో పక్కన సుద్దాల నరేశ్ అనే కానిస్టేబుల్ ఇల్లు కూడా పాక్షికంగా దెబ్బతింది. ఇంట్లో నుంచి మంటలు వస్తున్న విషయం గమనించిన స్థానికులు ఆ ఇంట్లో ఉన్న అంధురాలైన వృద్ధురాలిని హుటాహుటిన బయటకు తెచ్చి ప్రాణాపాయం నుంచి కాపాడారు. ఈ ఘటన గురించి తెలుసుకున్న వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని నష్టానికి సంబంధించిన వివరాలను అంచనా వేశారు.

## ఆర్టీసీ బస్సులో యువకుడి అసభ్య ప్రవర్తన

తంగళ్లపల్లి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీబస్సులో మద్యం తాగిన ఓ వ్యక్తి యువతులపై అసభ్యంగా ప్రవర్తించడంతో దేహశుద్ధి చేశారు. వివరాల్లోకి వెళితే సిద్ధిపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వేములవాడ నుంచి సిద్ధిపేటకు వెళ్తున్న సమయంలో మధ్యలో మద్యం సేవించిన ఓ ప్రయాణికుడు ఎక్కాడు. బస్సు తంగళ్లపల్లి మండలం సారంపల్లి మీదుగా వెళ్తున్న సమయంలో మద్యం మత్తులో ఆ వ్యక్తి యువతులతో అసభ్యంగా ప్రవర్తించాడు. యువతులు అతన్ని ప్రశ్నించడంతో వారిపై దాడికి యత్నించాడు. దీంతో యువతులు అతనికి దేహశుద్ధి చేశారు. డ్రైవర్ బస్సును నిలిపి నేరెళ్లలో అతన్ని దింపివేశాడు. ఈ సంఘటనకు సంబంధించిన వీడియోను ఓప్రయాణికుడు సెల్‌ఫోన్‌లో చిత్రీకరించాడు. ఈ ఘటన సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

## విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడు

● పోలీస్‌స్టేషన్‌లో విద్యార్థి బంధువుల ఫిర్యాదు



కమిలిపోయిన విద్యార్థి వీపు

గంభీరావుపేట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఒకటో తరగతి విద్యార్థిపై ఓ ఉపాధ్యాయుడు ప్రతాపం చూపించాడు. విద్యార్థి వీపుపై బాదడంతో తీవ్రంగా కమిలిపోయింది. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట ప్రాథమిక పాఠశాలలో లవన్‌సాయి అనే ఆరేళ్ల బాలుడు ఒకటో తరగతి చదువుతున్నాడు. శనివారం తరగతి గదిలో ఉపాధ్యాయుడు దేవరాజు లవన్‌సాయి అల్లరి చేస్తున్నాడని తీవ్రంగా కొట్టాడు. దెబ్బ లకు విద్యార్థి వీపు ఎర్రగా కమిలిపోయింది. సమాచారం అందు కున్న విద్యార్థి బంధువులు పాఠశాలకు చేరుకుని ప్రశ్నించగా అప్పటికే ఉపాధ్యాయుడు దేవరాజు పాఠశాల నుంచి జారుకు న్నాడు. ఇన్‌చార్జి హెచ్ఎం రామచంద్రంపై విద్యార్థి బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. లవన్‌సాయిని సిరిసిల్ల ఆసుపత్రికి తీసు కెళ్లి చికిత్స అందించారు. ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి బంధువులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

## అందని పరిహారం

● నిలిచిన అప్రోచ్‌రోడ్డు పనులు

● ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలంటున్న మండల ప్రజలు



గుంతలమయమైన మట్టి రోడ్డు


రామడుగు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రామడుగు బ్రిడ్జి నిర్మించిన అధికారులు దానికి అప్రోచ్‌రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవడం లేదు. రామడుగు వాగుపై శిథిలావస్థలో ఉన్న బ్రిడ్జిస్థానంలో నూతన బ్రిడ్జి నిర్మాణానికి ఏడుసంవత్సరాలక్రితం సుమారు రూ.8కోట్ల వ్యయంతో పనులు ప్రారంభించారు. భూములు కోల్పోయిన నిర్వాసితులకు డబ్బులు చెల్లించకపోవడం, తదితర కారణాలతో ఆరు సంవత్సరాలపాటు నత్తనడకన పనులు సాగాయి. దాదాపు 8మంది నిర్వాసితులు ఉండగా వారికి కోటి55లక్షల రూపాయల పరిహారం రావాల్సి ఉందని తెలుస్తోంది. పాతబ్రిడ్జి గత వానలకు పూర్తిగా కూలిపోయింది. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రత్యేక చొరవ తీసుకుని రైతులకు త్వరలోనే డబ్బులు ఇప్పిస్తామని హామీ ఇవ్వడంతో పనులు కొనసాగుటకు రైతులు సహకరించారు. దీంతో బ్రిడ్జినిర్మాణం పూర్తవగా కొద్దినెలలుగా వాహనరాకపోకలు కొనసాగుతున్నాయి. బ్రిడ్జికి ఇరువైపులా అప్రోచ్‌రోడ్డు నిర్మించకపోవడంతో వానలకు గుంతలు పడి వాహనాల రాకపోకలకు తీవ్రఇబ్బందులు ఎదురవుతున్నాయి.

ప్రస్తుతం వేసవినేపథ్యంలో దుమ్ముతో వాహనదారులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి ఒక దశలో పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్ ప్రయత్నించగా రైతులు అడ్డుకున్నట్లు తెలిసింది. ఎమ్మెల్యే హామీ ఇచ్చిన మేరకు ఇప్పటివరకు డబ్బులు అందకపోవడమే ప్రధానకారణం.

ఓవైపు డబ్బులు రాక రైతులు ఆందోళన చెందుతుండగా మరోవైపు మండల ప్రజలు రోడ్డు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. రైతులకు పరిహారం అందితే తప్ప నిర్మాణం జరిగే పరిస్థితి లేదని తెలుస్తోంది. ఎమ్మెల్యే చొరవ తీసుకుని రైతులకు పరిహారం ఇప్పించి అప్రోచ్ రోడ్డు పూర్తి చేయించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## జైన విగ్రహాన్ని కాపాడుకోవాలి

● డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి



జైన విగ్రహం వద్ద డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : సుమారు 1100ఏళ్లనాటి చరిత్రకు నిదర్శనం పాతబజార్ గౌరీశంకరాలయమని, ఆ ఆలయ ప్రాంగణంలోని జైన విగ్రహంపై రంగులు తొలగించి కాపాడాలని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియాఫౌండేషన్ సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి అన్నారు. స్థానిక యువ చరిత్ర పరిశోధకుడు కొల్లూరి శివకుమార్ సమాచారంతో శనివారం ఆలయంలో జైన విగ్రహాన్ని పరిశీలించారు. వేములవాడ చాళుక్యుల కాలపు ఈవిగ్రహం24 తీర్థంకరులలో ఒకరైన సుపార్శ్వనాథ్‌గా తెలిపారు. విగ్రహం భూమిలో కూరుకపోయి ఎర్రని రంగు పూయడంతో 1100 సంవత్సరాల చరిత్ర కోల్పోయామన్నారు. ఇప్పటికైనా చారిత్రక ప్రాధాన్యం ఉన్న ఈ విగ్రహానికి రంగులు తొలగించి భద్రత కల్పించాలని ఆలయ అధికారులకు, కరీంనగర్ జైన సంఘం బాధ్యులకు విజ్ఞప్తి చేశారు. మరో జైన విగ్రహం ఉండగా ధ్వంసమైందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చరిత్ర పరిశోధకుడు సంకేపల్లి నాగేంద్రశర్మ, కొల్లూరి సాయికుమార్, శిల్పి బి సుధాకర్ సింగ్ పాల్గొన్నారు.

## పేకాటరాయుళ్ల అరెస్ట్

బోయినపల్లి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): బోయినపల్లి మండలంలోని మల్లాపూర్ శివారులో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్సై పృథ్వీధర్ గౌడ్ తెలిపారు. శనివారం మల్లాపూర్ శివారులో కొంతమంది పేకాట ఆడుతున్నారని పోలీసులకు సమాచారం రావడంతో పోలీసులు వెళ్లారు. ఆరుగురు వ్యక్తులు పేకాట ఆడుతూ కనిపించడంతో వారి వద్ద నుంచి 8,200 నగదు, ఆరు సెల్‌ఫోన్లు రెండు, ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై తెలిపారు.

# దాగుడు మూతలు.. దండాకోర్!



● కనుమరుగవుతున్న గ్రామీణ క్రీడలు

● చిన్నారులకు వేసవిలో ఆటవిడుపు

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పచ్చనైన పల్లె సీమల్లో మట్టి పరిమళాల మధ్య సంప్రదాయ గ్రామీణ క్రీడల్లో శారీరక ఆరోగ్యం పెంపొందించుకున్న కాలం నుంచి స్మార్ట్ ఆటల యుగం నడుస్తోంది. ఈ హైటెక్ ఆటల ముందు ప్రాచీన గ్రామీణ క్రీడలు చిన్నబోతున్నాయి. నిజానికి వేసవి సెలవులు పిల్లలకు ఒక ఆట విడుపు. సెలవుల్లో పిల్లలకు వేసవి శిబిరాలు లేకపోతే ఇంట్లో టీవీ, వీడియో గేమ్స్, బయటకొస్తే క్రికెట్.. ఇది మాత్రమే ఇప్పటి పిల్లలకు అలవాటు. ఒకసారి వెనక్కి వెళ్లి చూస్తే గతంలో పల్లెల్లో ఆడుకున్న ఆటలు.. పాడుకున్న పాటలు గుర్తుకు వచ్చి.. ఈనాటి బాల్యం ఎలాంటిదని ఆలోచిస్తే బాధ కలుగకమానదు. శారీరక వ్యాయామం, మానసిక ఉల్లాసాన్ని అందించే గ్రామీణ ఆటలు ఎన్నెన్నో ఉన్నాయి. ఈ వేసవిలో పిల్లలు ఆడుకోదగ్గ ఆనాటి అద్భుతమైన ఆటల్ని మీకు పరిచయం చేయటమే ఈ ప్రయత్నం. ఈ ఆటల్లో సిర్రగొనె, గోళీలాట, దెబ్బలచండీ, అష్టచెమ్మా, కాసెపుల్ల, బొంగరాలాట, కొతికొమ్మ, దస్తాట, పెండలబుర్రి, సీకాట, పావులాట, వీరి వీరి గుమ్మడి పండు, అగ్గిపెట్టెలతో ఫోన్ ఆట, సిగరెట్ పెట్టెలతో పత్తాలాట, రెస్, పాము నిచ్చెన, పుంజీతం, చిత్తు బొత్తు, వంగుడు-దుంకుడు, జంటల్‌టెక్క, ముట్టి చుకునుడు ఇలాంటి ఆటలు అనేక ఉన్నాయి.



### ● సిర్ర - గోనె

ఈతరం పిల్లలు ఆడుకునే క్రికెట్ ఆటను పోలి ఉంటుంది. సిర్ర - గొనె ఆట. దీన్నే గిల్లి దండా అని కూడా అంటారు. కనీసం ఇద్దరు కలిసి ఆడుకునే ఆట ఇది. ఈ ఆటకు రెండు కర్ర వస్తువులు అవసరం పడతాయి. అవే సిర్ర - గోనె తొలుత బద్దీలో సిర్రను ఉంచి గోనెతో చిమ్ముతారు ఒక్కరు. పైకెగిరిన సిర్రను బుక్క (క్యాచ్) పడితే చిమ్మిన వారు ఔటయినట్లు లేనిచో ఆ సిర్రను బద్దీ వైపు విసురుతారు. అది బద్దీ వద్ద పడకుండా చిమ్మిన వ్యక్తి గోనెతో అడ్డుకుంటాడు. అచ్చం ఆధునిక బ్యాటింగ్ లాగా అడ్డుకోవడంలో విఫలమై ఆ సిర్ర బద్దీకి గోనె కంటే తక్కువ దూరంలో పడితే చిమ్మిన వ్యక్తి క్లీన్‌బౌల్డ్ లాగా ఔటయినట్టు లెక్క. ఒక వేళ సఫలమే అయితే సిర్రను గోనెతో కొట్టి పైకి లేపి మళ్లీ బలంగా బ్యాటింగ్ లాగా విసిరి కొడతాడు. దూరాన్ని గోనెతో కొలిచి రన్స్ లాగా స్కోరింగ్ చేసుకుంటారు.

### ● వీరి వీరి గుమ్మడి పండు..



పిల్లల సమూహం నుంచి ఒకరిని పెబ్బగా ఎన్నుకుంటారు. మిగిలిన వారిని వరుసగా నిలబెట్టి అందులో ఒకరిని దొంగగా భావించి పెబ్బ కళ్లు మూస్తారు. ఎదురుగా ఉన్న పిల్లల నుంచి ఒకరిని సైగ ద్వారా ముందుకు రమ్మని పిలుస్తారు. వారి దిక్కు వేలెత్తి చూపుతూ వీరి వీరి గుమ్మడి పండు వీరి పేరేంటని కళ్లు మూసుకున్న వారిని అడుగుతారు. సరైన పేరు చెప్పగలిగితే ఆ పేరు గల వ్యక్తి దొంగవుతారు. అబద్ధమైతే ముందుకొచ్చిన వారు ముక్కుపై గిచ్చి వెళతారు.



### ● కాసె పుల్ల

ఇసుకలో కూర్చుని ఇద్దరాడుకునే ఆట ఇది. ఆటగాళ్లలో ఒకరు మూరెడు సైజులో ఇసుక కట్టను చేసి అందులో ఒక కట్టెపుల్లను తెలియకుండా వదిలి పెట్టాలి. తర్వాత ఇంకో క్రీడాకారిణి ఆ పుల్లను ఎక్కడుందో గుర్తు పట్టడానికి ఇసుక కట్టపై ఒక చేతివేళ్లను ఇంకో చేతివేళ్లలో అల్లుకున్నట్లుగా చేసి రెండు చేతులతో మూస్తారు. ఆ పుల్ల ఆ చేతుల కింద ఉన్నట్లుయితే దాచి పెట్టే అవకాశం వస్తుంది. కనుక్కో లేని పక్షంలో ఓడిపోయారని దోసిల్లో ఇసుకను నింపి అందులో పుల్లపెట్టి.. గెలిచిన వారు ఓడిన వారి కళ్లు మూసి ఎక్కడో దూరంగా తెలియని ప్రదేశంలో ఆ ఇసుక కుప్పను పారబోయిస్తారు. యధాస్థానానికి వచ్చిన తర్వాత కళ్లు తెరిపిస్తారు. పారబోసిన ఇసుక కుప్పను కనుక్కోవడం ఆసక్తి కరంగా ఉంటుంది.



### ● దస్తాట

ఓ డజను మంది పిల్లలు వృత్తాకారంలో తలను నేలకేసి వంచి కూర్చుంటారు. అందులో ఒకరు రుమాలు (దస్తి)ను పట్టుకొని వారి వెనకాల మూడు రౌండ్లు తిరిగి ఒకరి వెనక వేస్తారు. వారు గుర్తించి వెంటనే లేచి దస్తీ పట్టుకొని రౌండ్లు కొట్టి మరొకరి వెనక వేయాల్సి ఉంటుంది. దస్తీ తన వెనకున్న విషయం ఆలస్యమైతే మిగతా పిల్లలు వీపులో పిడికిలి గుద్దులు గుద్దుతారు.



### ● అష్టాచెమ్మ

కొంచెం అటు ఇటుగా ఈ ఆట పచ్చీసును పోలి ఉంటుంది. నలుగురులోపు ఆటగాళ్లు దీన్ని ఆడతారు. చింతగింజలు, రాళ్లను పావులుగా వాడుకుంటూ గవ్వలతో పందెం కాస్తారు. ఇందులో అష్ట చెమ్మ అనే ప్రధాన పదాలుంటాయి. ఎవరు ముందు పావులతో ఇంటికి చేరితే వారు గెలిచినట్టు.



### ● గోలీలాట.. (లక్కాట)

గోలీలాటలో ఇది ఒక భాగం. ఈ ఆటను ఎంతమందైనా ఆడుకోవచ్చు. ఒకప్పుడు పల్లెటూళ్లలో ఈ ఆటను పిల్లలు బాగా ఆడుకునేవారు. ఈ ఆటతో వారి సృజనాత్మకత కూడా పెరిగేది. వృత్తంలో ఉన్న గోలీలను గురి చూసి కొట్టడం ఈ ఆట ప్రత్యేకత. గురి చూసి కొడితేనె గెలుపు. ఈ ఆట ఇప్పుడు దాదాపు కనుమరుగైంది.



### ● కోతి కొమ్మ

వేసవి సెలవుల్లో పిల్లల్ని తోటల వైపు ఆకర్షించి చెట్లపై కోతులుగా మార్చే ఆట ఇది. ఈ ఆటలో పెద్ద పెద్ద కొమ్మలున్న చెట్టును ముందుగా ఎంచుకుంటారు. ఆటకు ముందు ఆడే పిల్లలు చప్పట్లతో ఒకరిని దొంగగా గుర్తిస్తారు. మిగిలిన వారందరూ చెట్టెక్కి కొమ్మల మీద కోతిచేష్టలతో దొంగను ఆటపట్టిస్తుంటారు. దొంగ పిల్లాడు కూడా చెట్టెక్కి ఎవరో ఒకర్ని ముట్టుకుంటే అతడు తర్వాతి ఆటలో దొంగగా రావాల్సిందే. ఆ లోపు ఆటగాళ్లందరూ దొంగకు చిక్కకుండా చెట్టు దిగడమో.. లేదా చెట్టు కింద గీయబడ్డ వృత్తంలో దూకుతారు. అన్నట్టు చిన్నారులూ.. ఆట బాగుంది. కదాని రెచ్చిపోతే చెయ్యి, కాలు విరగ్గొట్టుకోవడం ఖాయం. జరంత జాగ్రత్త.

# జై హనుమాన్



నృత్యాలు చేస్తూ వస్తున్న దీక్షాపరులు

● కొండగట్టు అంజన్నకు భక్తజన హారతి ● అంజన్నను దర్శించుకున్న వేలాది భక్తులు

● ఘనంగా హనుమాన్ చిన్న జయంతి

మల్యాల, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో శనివారం హనుమాన్ చిన్న జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. జయంతి సందర్భంగా తరలివచ్చిన భక్తజనంతో కొండగట్టు కిక్కిరిసింది. అంజన్న దీక్షాపరుల సంకీర్తనలతో స్వామి పరిసరాలు భక్తి పారవశ్యంతో పులకించాయి. భక్తులు శ్రీరామ భక్తుడు హనుమంతుడిని తమ సంకీర్తనలతో కొలిచారు. అంజన్న దీక్షాపరులతో కొండగట్టు పుణ్యక్షేత్రం శనివారం రాత్రి కాషాయవర్ణాన్ని పులుముకుంది. ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల నుంచి అత్యధిక సంఖ్యలో అంజన్న దీక్షాపరులు కొండపైకి చేరుకుని 41, 21, 11 రోజుల దీక్ష బూనిన వారు మాల విరమణ చేశారు. ఘాట్‌రోడ్డు, మెట్లదారుల గుండా వచ్చిన దీక్షాపరులతో కొండంతా భక్తజనంతో నిండింది.



మాల విరమణ చేస్తున్న దీక్షాపరులు

### ● ఘనంగా హనుమాన్ చిన్న జయంతి

కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో శనివారం చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతియేటా చైత్ర పౌర్ణమి సందర్భంగా నిర్వహించే ఈ జయంతిలో భాగంగా అంజన్నకు విశేష అభిషేకం, తులసీ అర్చన, స్వామివారికి పట్టు వస్త్రాలంకరణ నిర్వహించారు. హనుమాన్ జయంతి సందర్భంగా ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, స్థానిక శాసనసభ్యుడు మేడిపల్లి సత్యం అంజన్నను దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఈవో శ్రీకాంత్‌రావు, ఉత్సవాల ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు, ఆలయ పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్, స్థానాచార్యులు కపీంధర్, ప్రధాన అర్చకులు రామకృష్ణ, జితేంద్రప్రసాద్ స్వామి, రఘు ఉపప్రధాన అర్చకులు చిరంజీవి, మారుతీ సిబ్బంది, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కొండగట్టు అంజన్న స్వామిని రాజన్న సిరిసిల్ల కలెక్టర్ సందీప్ కుమార్ ఝా దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆశీర్వాదం అందించారు.





కోనేరు వద్ద భక్తజనం

### ● కొండపైనే కలెక్టర్, ఎస్పీ మకాం..



సీసీ కెమెరాల ద్వారా భక్తుల రద్దీ పర్యవేక్షిస్తున్న కలెక్టర్, ఎస్పీ

హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాల సందర్భంగా కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్ ప్రత్యేక పర్యవేక్షణ చేస్తూ నిత్యం కొండపైన ఏర్పాట్లు పరిశీలిస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రెండు రోజులుగా భక్తులు అధికంగా వచ్చే సమయంలో కొండపైన కలియతిరుగుతూ అర్ధరాత్రి వరకు కొండపైనే ఉంటూ, భక్తుల వద్దకు వెళుతూ సమస్యలు తెలుసుకొని తగు పరిష్కార సూచనలు ఇచ్చారు. సీసీ కెమెరాల ద్వారా ఎప్పటికప్పుడు భక్తుల రద్దీ, దీక్షా విరమణ, దర్శనాలు తదితరవి పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చూడాలని అధికారులకు సూచనలు చేశారు.

### ● అడుగడుగునా ఇబ్బందులు.. భక్తుల అసహనం



ఘాట్‌రోడ్డు పక్కన చలివేంద్రం దుస్థితి

మల్యాల, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో శనివారం జరిగిన హనుమాన్ చిన్న జయంతి సందర్భంగా వేలాదిగా భక్తులు తరలి రాగా అడుగడుగున భక్తులు ఇబ్బందులు పడ్డారు. పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉండడంతో భక్తులు అసహనం వ్యక్తం చేశారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసి ప్రస్తుతం ఉన్న సిబ్బందికి తోడు మరో 366 మందిని అదనంగా ఉత్సవాల కోసం నియమించినప్పటికీ ఎక్కడపడితే అక్కడ చెత్త ఉండడంపై మండిపడ్డారు. అలాగే భక్తుల కోసం ఏర్పాటు చేసిన చలివేంద్రాల్లోనూ సకాలంలో నీరు అందుబాటులో ఉంచకపోవడంతో ఎండలతో భక్తులు అసౌకర్యానికి గురయ్యారు. దీక్షాపరుల మాలవిరమణ సందర్భంగా కొందరు అర్చకులు డబ్బులు వసూలు చేయడం, తలనీలాలు సమర్పించే చోట క్షురకులు డబ్బులు ఇస్తేనే తలనీలాలు తీస్తామంటూ బలవంతంగా డబ్బులు డిమాండ్ చేశారు. ఎంతో భక్తిప్రపత్తులతో వస్తే బలవంతంగా వసూలు చేయడమేంటని భక్తులు ఆరోపించారు. స్నానాల కోసం కాంట్రాక్టర్లు రూ.20నుంచి 30వరకు వసూలు చేశారని అంజన్న సన్నిధిలో వ్యాపారులు అధిక ధరలతో తమను నిలువు దోపిడీకి గురి చేశారంటూ కొందరు భక్తులు ఆరోపించారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

## వైభవంగా మహమ్మాయిదేవి జాతర

● తరలివచ్చిన భక్తులు

● ప్రత్యేక పూజలు, హోమాలు



మహమ్మాయి దేవి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

సుల్తానాబాద్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మహాశక్తి పీఠంగా పూజలు అందుకుంటున్న మహమ్మాయి దేవి జాతర ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శనివారం రాష్ట్రంలోని నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. ఎండను సైతం లెక్కచేయకుండా పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. మహమ్మాయి అమ్మ వారిని దర్శనం చేసుకోవడానికి ఏర్పాటు చేసిన క్యూలైన్లు అన్నీ నిండిపోయాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పోలీసులు వాహనాలను కొంత దూరంలోనే పార్కింగ్ చేయించారు. వారం రోజులుగా ఇక్కడ ఉత్సవాలు జరుగుతున్నాయి. శనివారం జాతర కావడంతో ఉదయంనుంచి భక్తుల తాకిడి మొదలయింది. ఆదివారం తెల్లవారుఝాము వరకు భక్తులు దర్శనం కోసం వస్తుంటారని ఆలయఉత్సవాల నిర్వాహకకమిటీ ప్రతినిధి దేవరకొండ కృష్ణమాచార్యులు తెలిపారు. ఆలయంలో నిర్వహించిన హోమాలు, పూర్ణాహుతి, అమ్మ వారికి అర్చన పూజలు ఘనంగా నిర్వహించారు. పలు జిల్లాల నుంచి వచ్చిన భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదానం, ప్రసాదాలు పంపిణీ చేశారు. ఎండల నుంచి ఉపశమనం కోసం చలువ పందిళ్లతో పాటు చల్లని నీరు, మజ్జిగ ఏర్పాట్లు చేశారు.

## నేడు పెద్దాపూర్ లక్ష్మీనర్సింహస్వామి జాతర

జూలపల్లి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పెద్దాపూర్ గ్రామశివారులో గల యోగానంద లక్ష్మీనర్సింహస్వామి జాతర ఆదివారం జరగనుంది. ఆదివారం వేకువజామున రథోత్సవం నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు గొట్టెముక్కుల రవిందర్‌రెడ్డి, గొట్టెముక్కుల రాజభాస్కర్ రెడ్డి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ రథోత్సవానికి ఉమ్మడి కరీంనగర్ జిల్లాతోపాటు మంచిర్యాల, తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండ ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. పోలీసులు వాహనాల పార్కింగ్, తదితర ఏర్పాట్లను పరిశీలించారు.



ముస్తాబైన యోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయం

## ●అవీ..ఇవీ

**సుభాష్‌నగర్:** అంబేద్కర్ 117వ జయంతి కార్యక్రమానికి కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరించాలని మాల జేఏసీ నాయకులు కోరారు. శనివారం జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి పవన్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

కరీంనగర్ క్రైం: సెల్‌ఫోన్ రిపేర్ చేసే వారితోపాటు వ్యాపారులు, విడిభాగాల అమ్మకందారుల పొట్టగొడుతున్న రాజస్థాన్ మార్వాడి వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని కరీంనగర్ సెల్యూలర్ అసోసియేషన్ ప్రతినిధులు శనివారం కరీంనగర్ వన్ టౌన్‌లో ఫిర్యాదు చేశారు.

**కరీంనగర్ రూరల్:** కరీంనగర్ మండలం నగునూర్ తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల కళాశాలలో శనివారం బాబు జగ్జీవన్‌రామ్, మహాత్మా జ్యోతి బాపూలే, డాక్టర్ అంబేద్కర్ జయంత్యుత్సవాలను నిర్వహించారు. మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేశారు.

**గణేశ్‌నగర్:** కరీంనగర్ పట్టణంలోని వాగేశ్వరి డిగ్రీ పీజీ కళాశాలలో శనివారం ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జాస్తి రవికుమార్, ఓఎస్డీ వైస్ చాన్సలర్ డాక్టర్ డి.హరికాంత్, కళాశాల చైర్మన్ గోపాల్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు.

**గణేశ్‌నగర్:** నగరంలోని ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్‌అండ్‌సైన్స్ కళాశాల (అ) లోని అంబేద్కర్ ప్రాంతీయ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో ఆది, సోమవారాల్లో సామాజిక సాధికారత వారోత్సవాలు నిర్వహించనున్నట్లు కళాశాల(అ) కరీంనగర్ పిన్సిపాల్ ప్రొఫెసర్ రామకృష్ణ, రీజినల్ కోఆర్డినేటర్ డాక్టర్ వంగల శ్రీనివాస్ తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా ఆదివారం 'భారత రాజ్యాంగ ప్రవేశికను ఎలా అర్థం చేసుకున్నారు' అనే అంశంపై ఉపన్యాస, 14న భారత రాజ్యాంగం- సామాజిక న్యాయం అనే అంశంపై విద్యార్థులకు వ్యాస రచన పోటీలు ఉంటాయని పేర్కొన్నారు.

**గణేశ్‌నగర్:** బీసీ స్టడీ సర్కిల్ కరీంనగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత శిక్షణ బ్యాంకింగ్ పరీక్షలు శనివారం ప్రశాంతంగా ముగిశాయి. జ్యోతిష్మతి ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆన్ లైన్ పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ పరీక్షకు మొత్తం 67 మంది హాజరైనట్లు తెలిపారు.

**గణేశ్‌నగర్ :** మహనీయుల జయంత్యుత్సవాల సందర్భంగా శాతవాహన యూనివర్సిటీలో శనివారం నిర్వహించిన రంగోలి, క్విజ్ పోటీలను వీసీ ప్రొఫెసర్ ఉమేష్ కుమార్, రిజిస్ట్రార్ ఆచార్య రవి కుమార్ జాస్తి ప్రారంభించారు. జగ్జీవన్ రామ్, జ్యోతిబాపూలే, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేశారు.

**కరీంనగర్ కల్చరల్:** తెలంగాణ సాహితీ ఆధ్వర్యంలో గతంలో నిర్వహించిన కవితలు, వ్యాసరచన పోటీల విజేతలకు అంబేద్కర్ జయంతి సందర్భంగా సోమవారం భగత్‌నగర్ వివేకానంద హైస్కూల్లో బహుమతులు అందజేయనున్నట్లు తెలంగాణ సాహితి రాష్ట్ర కార్యదర్శి రాములు ప్రకటనలో తెలిపారు.

# ఘనంగా చిన్న హనుమాన్ జయంతి

● ఆలయాల్లో ప్రత్యేక పూజలు



అంజనేయస్వామిని దర్శనం చేసుకుంటున్న భక్తులు

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): చైత్ర శుద్ధ పౌర్ణమి సందర్భంగా ఆలయాల్లో శనివారం చిన్న హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే హనుమాన్ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. జైశ్రీరాం, జై హనుమాన్, రామలక్ష్మణ జానకీ జయ బోలో హనుమాన్‌కీ.. అంటూ భక్తుల నామస్మరణలు మిన్నంటాయి. పారాయణాలు, హవనాలు, ప్రత్యేక పూజలు, అభిషేకాలతో ఆధ్యాత్మికత వెల్లివెరిసింది. పలు చోట్ల అన్నదానం చేశారు. భగత్‌నగర్, అంజనాద్రి, జ్యోతినగర్ హనుమాన్ సంతోష్‌మాత, గణేశ్‌నగర్ ప్రసన్నాంజనేయస్వామి, హెలీప్యాడ్‌గ్రౌండ్ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం, ప్రశాంతనగర్ ప్రసన్నాంజ నేయస్వామి, కట్టరాంపూర్‌లోని అభయాంజనేయస్వామి, పాత బజార్ చిన్నహనుమాన్, మంకమ్మతోట భక్తాంజనేయస్వామి దేవాలయం, రాంనగర్ రమాసహిత సత్యనారాయణ స్వామి, అభయాంజనేయస్వామి దేవాలయం, పాతబజార్ గౌరీ శంకరాలయంలోని హనుమాన్ సన్నిధిలో, రామచంద్రాపూర్ కాలనీ, రామభక్తాంజనేయస్వామి, మారుతినగర్ చౌరస్తా, అభయాంజ నేయస్వామి ఆలయాలతోపాటు తిరుమలనగర్ మయూరగిరి పీఠంలో పూజలు చేశారు.

## చల్మెడ వైద్య కళాశాలలో స్నాతకోత్సవం



గ్రాడ్యుయేషన్ పట్టా అందజేస్తున్న కేటీఆర్, గంగుల కమలాకర్

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారు బొమ్మకల్‌లోని చల్మెడ ఆనందరావు వైద్య కళాశాలలో శనివారం స్నాతకోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎంబీబీఎస్ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పట్టాలను పంపిణీ చేశారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్, చల్మెడ ఆనందరావు వైద్య కళాశాల చైర్మన్ చల్మెడ లక్ష్మీనరసింహారావు. డైరెక్టర్ సూర్య నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నీల ముచ్చట్లు ఓ బహుళ వెన్నెల

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): దశాబ్దకాలపు ఎన్నీల ముచ్చట్ల ప్రయాణంలో బహుళ వెన్నెల వెల్లివిరుస్తోందని కవి, గాయకుడు గాజోజు నాగభూషణం అన్నారు. తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో శనివారం కవి మెరుగు ప్రవీణ్ నివాసంలో 144వ ఎన్నీల ముచ్చట్ల సాహితీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాగభూషణం మాట్లాడుతూ కవితలు, కథలు, పాటలు, గేయాలతో కరీంనగర్ సృజనను ఎన్నీల ముచ్చట్లు సుసంపన్నం చేస్తున్నాయన్నారు. అధ్యక్ష కార్యదర్శులు సీవీ కుమార్, దామెరకుంట శంకరయ్య, నడిమెట్ల రామయ్య, కందుకూరి అంజయ్య, మమత వేణు, విలాసాగరం రవీందర్, గిరిధర్‌రావు పాల్గొన్నారు.

## బీజేపీ ఆధ్వర్యంలో చలో బస్తీ

భగత్‌నగర్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఆవిర్భావ వేడుకల్లో భాగంగా నగరంలోని 19వ డివిజన్ రేకుర్తిలో చలో బస్తీ కార్యక్రమం నిర్వహించారు. రేకుర్తిలోని లక్ష్మీ నర్సింహస్వామి, అంజనేయస్వామి, రంగనాథస్వామి దేవాలయాలను దర్శించుకుని లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో స్వచ్ఛ భారత్ చేపట్టారు. అనంతరం బైక్ ర్యాలీ నిర్వహించారు.

నగరంలోని 17వడివిజన్ వికలాంగుల కాలనీలో చలోబస్తీ నిర్వహించారు. ఎమర్జెన్సీ సమయంలో జైలుకు వెళ్లిన బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బాస సత్యనారాయణరావును సన్మానించారు.

**కరీంనగర్ రూరల్:** బీజేపీ 'గావ్ చలో' లో భాగంగా శనివారం కరీంనగర్ మండలం చేగుర్తి పురాతన ఆలయాల్లో స్వచ్ఛ భారత్ నిర్వహించారు. అనంతరం బూత్ కమిటీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు.బీజేపీ మండల అధ్యక్షుడు సంతోష్ పాల్గొన్నారు.

బొమ్మకల్‌లోని ఆలయాల పరిసరాలను శుభ్రం చేశారు. డివిజన్‌లో సన్న బియ్యం పంపిణీని పరిశీలించారు.

## కరీంనగర్ బార్ అసోసియేషన్ కార్యవర్గం

కరీంనగర్ లీగల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ బార్ అసోసియేషన్ కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లింగంపల్లి నాగరాజు, ఉపాధ్యక్షుడిగా చందా రమేష్, ప్రధాన కార్యదర్శిగా కందుల అరుణ్‌కుమార్ ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శి పదవికి పోటీ చేసిన వారిలో కందుల అరుణ్ కుమార్‌కు 222 ఓట్లు, చంద్రపాటి కిరణ్‌కుమార్‌కు 221 రాగా రీకౌంటింగ్ కోరారు. రీకౌంటింగ్ నిర్వహించగా ఇద్దరికీ సమాన ఓట్లు వచ్చాయి.. దీంతో టాస్ వేయగా కందుల అరుణ్ కుమార్ విజేతగా నిలిచారు. ఈ మేరకు ఎన్నికల అధికారి మాధవ్‌రావు ప్రధాన కార్యదర్శిగా అరుణ్‌కుమార్ ఎన్నికైనట్లు ప్రకటించారు. జిల్లా కోర్టు ఆవరణలో శుక్రవారం ఉదయం 8.30 నుంచి 3 గంటల వరకు ఎన్నికలు నిర్వహించగా సాయంత్రం ఫలితాలు వెల్లడించారు. ఎన్నికల్లో 859 మంది న్యాయవాదులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎన్నికైన కార్యవర్గం ఏడాదిపాటు పదవిలో కొనసాగనుంది. కొత్త కార్యవర్గానికి న్యాయవాదులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ తమ ఎన్నికకు సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.



నాగరాజు



అరుణ్‌కుమార్

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతులు, చెట్లకొమ్మల తొలగింపులో భాగంగా ఆదివారం వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్‌టు, రూరల్ ఏడీఈలు లావణ్య, రఘు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 10 వరకు గణేష్‌నగర్ బైపాస్, తిరుమల థియేటర్, వసంత్‌వ్యాలీ స్కూల్, ధ్రువాసి కార్ఖానా, లక్ష్మణ్‌రావు ఇల్లు, జేప్టో ప్రాంతాల్లో, ఉదయం 8 గంటల నుంచి 10:30 వరకు శక్తి ఆలయం, బాలాజీ సూపర్ మార్కెట్, సంతోష్‌నగర్, భాగ్యనగర్, జ్యోతినగర్, గీతాభవన్ వెనుక వైపు ఏరియా,కార్పెంటర్ సొసైటీ ఏరియా, సంతోష్ మాతా, హనుమాన్ దేవాలయం, కొత్త లేబర్ అడ్డా, సాయి బాబా ఆలయం, ఉదయం 9 గంటల నుంచి 12:30 నగునూర్, వల్లంపాడు, తీగలగుట్టపల్లి, ఉదయం 9 గంటల నుంచి ఉదయం 11:30 వరకు చింతకుంట(పార్టికల్), శ్రీరాంనగర్ కరీంనగర్, మల్కాపూర్, కమాన్‌పూర్, గ్రానైట్ పరిశ్రమలు, కొత్తపల్లి (హెచ్), వెలిచాల, దేశరాజ్‌పల్లి, వెదిర, మిషన్ భగీరథ, ఉదయం 9 గంటల నుంచి 12 వరకు ఎన్టీఆర్ విగ్రహం నుంచి ఉజ్వల పార్క్ సబ్ స్టేషన్ వరకు (బైపాస్‌ఏరియా), పాలిటెక్నిక్ కళాశాల, ఐటీహబ్, ఐటీఐ కళాశాల, డీ మార్ట్ ఏరియాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

## దుర్శేడ్‌లో నీటి ఎద్దడి

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం దుర్శేడ్‌లో నీటి ఎద్దడితో గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్ల వద్ద బోర్లలో నీరు అడుగంటి పోయింది. వాటర్ ట్యాంక్ వద్ద బోర్ వేసి ప్రజలకు అందిస్తున్నారు. చుట్టు పక్కల 20 బోర్ల నుంచి నీరు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మానేరు నుంచి నీటిని సరఫరా చేయాలని, దీంతోపాటు గ్రామంలో పని చేయని చేతిపంపులకు మరమ్మతు చేపట్టాలని కోరుతున్నారు

## వక్ఫ్‌బోర్డు సవరణ చట్టాన్ని రద్దు చేయాలి

భగత్‌నగర్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ విరుద్ధమైన వక్ఫ్‌బోర్డు సవరణ చట్టాన్ని రద్దు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కొయ్యడ సృజన్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని కమాన్ చౌరస్తాలో వక్ఫ్‌బోర్డు చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. సీపీఐ నగర కార్యదర్శి సురేందర్ రెడ్డి, రాజు, బుచ్చన్నయాదవ్ పాల్గొన్నారు.

## అల్ఫోర్స్ టైనీటాట్స్‌లో గ్రాడ్యుయేషన్ డే



విద్యార్థులను అభినందిస్తున్న నరేందర్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ టైనీటాట్స్ పాఠశాలలో శనివారం యూకేజీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల అధినేత వి.నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ప్రాథమిక దశ నుంచే నాణ్యమైన విద్యనందించాలని, అన్నిరంగాల్లో అభివృద్ధి చెందే విధంగా ప్రోత్సాహం అందించాలని అన్నారు. అనంతరం నిర్వహించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

## ఒలింపియాడ్‌లో అల్ఫోర్స్ విద్యార్థులకు స్వర్ణ పతకాలు

భగత్‌నగర్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): సాంఘీక శాస్త్ర ఒలింపియాడ్‌లో అల్ఫోర్స్ విద్యార్థులు బంగారుపతకాలు సాధించారు. శనివారం కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నోపాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వినరేందర్‌రెడ్డి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యూఢిల్లీకి చెందిన సిల్వర్ జోన్ ఫౌండేషన్ నిర్వహించిన అంతర్జాతీయ సాంఘీక శాస్త్రం ఒలింపియాడ్‌లో పాఠశాలకు చెందిన బొంగోని కార్తికేయ, హరిశ్రీహరిణి, ఎం.విఘ్నేశ్చంద్ర, హిమేష్ పతకాలు సాధించడం అభినందనీయమన్నారు.

## ఒలింపియాడ్‌లో పారమిత విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

భగత్‌నగర్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ ఒలింపియాడ్ ఫౌండేషన్ అంతర్జాతీయ స్థాయిలో పారమిత విద్యార్థులు ప్రతిభ చాటారు. పారమిత హెరిటేజ్ పాఠశాలకు చెందిన శక్తికిరణ్‌శెట్టి, అర్హాన్‌లతీఫ్, సౌత్ జోన్ టాపర్లుగా నిలిచారు. పాఠశాల ఆవరణలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ డాక్టర్ ప్రసాదరావు విద్యార్థులను అభినందించారు. డైరెక్టర్లు ప్రసూన, అనూకర్‌రావు, రశ్మిత, రాకేష్; వీయూఎం ప్రసాద్, వినోద్‌రావు, టీఎస్‌వీ రమణ, హన్మంతరావు పాల్గొన్నారు.

## మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శిగా రామారావు



టి.రామారావు

సుభాష్‌నగర్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): తెలంగాణ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శులుగా జిల్లా జనరల్ ఆస్పత్రిలో పనిచేస్తున్న టి.రామారావు (ఫార్మసిస్టు), హుజూరాబాద్ ఏరియా ఆసుపత్రిలో నర్సింగ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న పి.స్వాతిని ఎన్నుకున్నారు. శనివారం హైదరాబాద్‌లో యూనియన్ సమావేశం అనంతరం ఎన్నిక నిర్వహించారు. జిల్లాకు చెందిన ఇద్దరికి స్థానం కల్పించడంపై పలువురు ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.

## సిమెంట్ బెంచీల అందజేత

సుభాష్‌నగర్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ సీనియర్ వైద్య నిపుణుడు డాక్టర్ రఘురామన్ శనివారం కొండగట్టు గిరిప్రదక్షణ భక్తుల కోసం సిమెంట్ బెంచీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టులో ఇటీవల గిరిప్రదక్షిణ ప్రారంభించారని, గిరి ప్రదర్శన మార్గంలో భక్తులు సేద తీరడానికి బెంచీలు అవసరమని బాధ్యులు కోరారని పేర్కొన్నారు. వారి కోరిక మేరకు దారం సుశీల ట్రస్టు తరఫున బెంచీలను అందజేసినట్లు చెప్పారు.

## మూడో రోజు జయపాల్‌రెడ్డి అన్నప్రసాదం

భగత్‌నగర్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మైత్రి గ్రూప్ చైర్మన్ కొత్త జయపాల్ రెడ్డి ఆధ్వర్యంలో హనుమాన్ మాలదారులకు నిర్వహిస్తున్న అన్న ప్రసాద కార్యక్రమం మూడో రోజు కొనసాగింది. కొత్తపల్లిలోని జయపాల్ రెడ్డి ఫామ్ హౌస్‌లో అన్నమనేని రాంప్రసాద్ అన్నదాతగా వ్యవహరించగా 300 మంది భక్తులకు గురుస్వామి డి.సంపత్ ఆధ్వర్యంలో అన్నప్రసాదాన్ని అందజేశారు.

## ఘనంగా లక్ష్మీనరసింహస్వామి శకటోత్సవం



గంగాధరలో స్వామివారి కల్యాణం

గన్నేరువరం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి వేదపండితులు కల్యాణం జరిపించి శకటోత్సవం నిర్వహించారు. ప్రతిఏటా భక్తులు స్వామివారి ఆలయం చుట్టూ ఎండ్లబండ్లు, వాహనాలతో ప్రదక్షిణలు చేసి మొక్కులను చెల్లించుకుంటారు. ఆదివారం గ్రామంలో స్వామివారిని రథంపై ఊరిగించి జాతరను నిర్వహిస్తారు.

**గంగాధర:** మండలంలోని కోట్ల నర్సింహులపల్లిలో లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఒకేవేదికపై శ్రీలక్ష్మీనర్సింహస్వామి, సీతారామస్వామి, వేంకటేశ్వరస్వామి, గోదా, రంగనాథుల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు.

## వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం



గోపాల్‌రావుపేటలో మొక్కులు చెల్లించుకుంటున్న నరేందర్ రెడ్డి

రామడుగు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాల్‌రావుపేటలో శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. వేడుకల్లో అల్ఫోర్స్ అధినేత డాక్టర్ వి నరేందర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

**గిరి దర్శనం విజయవంతం..**

రామడుగు మండలం గోపాల్‌రావుపేట గ్రామస్థులు చేపట్టిన కొండగట్టు గిరిదర్శనం విజయవంతంగా ముగిసింది. అల్ఫోర్స్‌విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి సహకారంతో గ్రామస్థులు వాహనాలలో కొంగట్టు గిరిప్రదర్శన చేపట్టారు.

## వైభవంగా రథోత్సవం

చొప్పదండి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుక్మాపూర్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయబ్రహ్మోత్సవాలు వైభవంగా జరిగాయి. ఉత్సవాలలో చివరిరోజున జాతర జరిగింది. రథోత్సవంలో భక్తులు భారీసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం శోభాయాత్రవైభవంగా జరిగింది. కాట్నపల్లిలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

## కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో అధికారుల జాప్యం

● అకాల వర్షాలతో ఆందోళన ● ప్రైవేటు వ్యక్తులకు విక్రయిస్తున్నరైతులు

తిమ్మాపూర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చాలాగ్రామాల్లో రైతులు వరికోతలు ప్రారంభించి విక్రయానికి ధాన్యాన్ని సిద్ధంచేశారు. మండల వ్యాప్తంగా మొత్తం 25కొనుగోలుకేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాగా ఇప్పటివరకు ఒక్కటి కూడా ప్రారంభం కాలేదు. వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటున్న కారణంగా అన్నదాతల గుండెల్లో రైళ్ల పరుగెడుతున్నాయి. ఎప్పుడువర్షం కురుస్తుందో, ధాన్యం ఎక్కడ తడిచి పాడై పోతుందోనని రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు.

ఇదేఅదునుగా భావించిన దళారులు రైతుల వద్ద నుంచి ప్రభుత్వ ధర కన్నా రెండు నుంచి మూడువందల రూపాయల తక్కువకు కొనుగోలు చేస్తున్నారు. మూడుకిలోల వరకు ఎక్కువతూకం వేస్తుండటంతో రైతులు నష్టపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు త్వరగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి ధాన్యం కొనుగోలుచేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



పాలంపల్లిలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్న ప్రైవేటు వ్యక్తులు

## బీఆర్ఎస్ రజతోత్సవ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లను అంటిస్తున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఈనెల27న హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభ పోస్టర్‌ను శనివారం హుజూరాబాద్‌లో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 27నఎల్కతుర్తిలో జరిగే సభకు హుజూరాబాద్ నియోజకవర్గం నుంచి భారీ ఎత్తున తరలిరావాలని కోరారు.

## అంబేద్కర్ సంఘం పట్టణ కార్యవర్గం

చొప్పదండి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ యువజనసంఘం పట్టణ కార్యవర్గాన్ని మండలఅధ్యక్షుడు కడారి గంగరాజు ప్రకటించారు. పట్టణ అధ్యక్షుడిగా వడ్లూరి శ్రీనివాస్, ప్రధానకార్యదర్శిగా కొత్తపల్లి చింటూ, ఉపాధ్యక్షులుగా కనకం శ్రీనివాస్, లింగంపల్లి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శులుగా సోమిడి అభిషేక్, కొత్తూరి ప్రేమ్‌కుమార్, దీకొండ హరీష్, ఇరుగురాల భూమేష్, కొత్తూరినరేందర్, పెద్దెల్లి అనిల్ కుమార్, సాంస్కృతిక కార్యదర్శిగా కల్లెపల్లి అనిల్‌కుమార్, కోశాధికారిగా కొత్తూరి దినేష్, ప్రచార కార్యదర్శిగా పెద్దెల్లి జగదీష్, కల్లెపెల్లి ఉదయ్, కల్లెపల్లి రిషి, పోగుల రాజుతో కార్యవర్గాన్ని ప్రకటించారు.

## దేశ హితం కోసం పుట్టిన పార్టీ బీజేపీ

● పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న గంగాడి కృష్ణారెడ్డి, నాయకులు

హుజూరాబాద్/వీణవంక, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): దేశ హితం కోసం పుట్టిన ఏకైక పార్టీ బీజేపీ అని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. శనివారం హుజూరాబాద్ పరిధిలోని ఇప్పల్ నర్సింగాపూర్‌లో, వీణవంక మండలంలోని పోతిరెడ్డిపల్లిగ్రామంలో గావ్ చలో బస్తీ చలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ బీజేపీని సీఎంరేవంత్‌రెడ్డి వ్యతిరేకిస్తూ, బ్రిటీష్ వాళ్లకంటే బీజేపీ ప్రమాదకరమని వ్యాఖ్యలు చేయడాన్ని తప్పుపట్టారు. దేశాన్ని దోచుకున్న బ్రిటీష్ వాళ్ల సీఎం రేవంత్‌రెడ్డికి గొప్పవాళ్లుగా కనిపించడం విడ్డూరంగా ఉందన్నారు. అనంతరం గ్రామంలో బైక్‌ర్యాలీ నిర్వహించి, దేవాలయ స్వచ్ఛత, రచ్చబండ కార్యక్రమం, బూత్‌కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణాధ్యక్షుడు తూర్పాటి రాజు, పైళ్ల వెంకట్ రెడ్డి, యాళ్ల సంజీవ రెడ్డి, పల్లె వీరయ్య, లీల, మహేష్, గంగిశెట్టి ప్రభాకర్, వీణవంక మండల అధ్యక్షుడు బత్తిని నరేష్ గౌడ్, నర్సింహ రాజు తదితరులు పాల్గొన్నారు.

## అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు

● అరకొర వసతులతో కాలం వెళ్లదీస్తున్నవైనం

మానకొండూర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్ మండలంలో సొంతభవనాలు లేక అద్దెభవనాల్లో అంగన్‌వాడీకేంద్రాలు నడుస్తున్నాయి. మిగతాకేంద్రాలు ప్రభుత్వపాఠశాలల్లో అరకొరవసతుల మధ్య కొనసాగుతున్నాయి. మండలంలో మొత్తం 50అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి.

మానకొండూర్ క్లస్టర్ పరిధిలోని బంజేరుపల్లి, లింగాపూర్‌లో టీచర్లు లేకుండా కొనసాగుతున్నాయి. దేవంపల్లి, జగ్గయ్యపల్లి, లక్ష్మీపూర్, మానకొండూర్‌లో రెండు, సదాశివపల్లి, శ్రీనివాస్‌నగర్‌గ్రామాల్లోని అంగన్‌వాడీకేంద్రాల్లో ఆయాలు లేరు. అన్నారం, మానకొండూర్‌లో రెండు కేంద్రాలు అద్దె భవనంలో కొనసాగుతుండగా ఐదు కేంద్రాలు ప్రభుత్వ పాఠశాలలలో నడుస్తున్నాయి. మరో 19అంగన్‌వాడీ కేంద్రాలు సొంత భవనాల్లో కొనసాగుతున్నాయి.

చెంజర్ల క్లస్టర్ పరిధిలో.. పోచంపల్లి, రంగపేట, ఖాదర్‌గూడెం, మద్దికుంట, కొండపల్కల, గట్టుదుద్దెనపల్లి, ఊటూర్ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయాలు లేరు. కొండపల్కల అంగన్‌వాడీ సెంటర్ అద్దె భవనంలో కొనసాగగా 5ప్రభుత్వ పాఠశాలల్లో, 17అంగన్‌వాడీకేంద్రాలు స్వంత భవనాల్లో కొనసాగుతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల్లో మెనూప్రకారం గర్భవతులు, బాలింతలకు ప్రతిరోజు అన్నం, 200మిల్లీలీటర్ల పాలు, కోడిగుడ్డు పిల్లలకు మధ్యాహ్న భోజనంతోపాటు కోడిగుడ్డు, సాయంత్రంస్నాక్స్‌నుఅందజేస్తారు. అంతేకాకుండా బరువు ఉన్న పిల్లలకు బాలామృతం అందజేస్తారు. అద్దెభవనాలు, అరకొర వసతులమధ్య కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాలతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.



అన్నారంలో అద్దె భవనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం

## ●సంక్షిప్తంగా..

**ఇల్లందకుంట:** ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీ బీజేపీ అని ఆ పార్టీ మండలాధ్యక్షుడు బైరెడ్డి రమణారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కనగర్తిలో బూత్ అధ్యక్షుడు ఉప్పుల శ్రీనివాస్, బండి సాంబరాజుల ఆధ్వర్యంలో గావ్‌చలో బస్తీచలో కార్యక్రమాన్ని నిర్వహించారు.

**జమ్మికుంట రూరల్/శంకరపట్నం:** జమ్మికుంట మున్సిపల్‌పరిధిలోని పలు వార్డుల్లో కాంగ్రెస్‌పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకరిరమేష్, శంకరపట్నం మండలంలోని గ్రామాల్లో మండలాధ్యక్షుడు గోపగోని బసవయ్య ఆధ్వర్యంలో జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ పాదయాత్ర నిర్వహించారు.

**హుజూరాబాద్/చొప్పదండి:** హుజూరాబాద్ పట్టణంలో, చొప్పదండి మండలంలో చిన్న హనుమజ్జయంతిని పురస్కరించుకొని శనివారం హనుమాన్ దేవాలయంలో భక్తులు ప్రత్యేకపూజలు చేశారు. మహాఅన్నదానం నిర్వహించారు. అనంతరం హనుమాన్‌భక్తులు పట్టణంలో ర్యాలీ తీశారు. చొప్పదండిలోని జ్ఞాన సరస్వతి ఆలయంలో పౌర్ణమిప్రత్యేక పూజలను నిర్వహించారు.

**హుజూరాబాద్:** పట్టణంలోని శ్రీరామ ఆస్పత్రిలో శనివారం మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరామ, ఆర్కే, శరత్‌మాక్స్‌విజన్ ఆస్పత్రుల ఆధ్వర్యంలో రూ.5వేల విలువ చేసే 58రకాల వైద్య పరీక్షలను రూ. 999కే నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు స్వామిరావు, రాజేష్, నిర్వాహకులు పాల్గొన్నారు.

**ఇల్లందకుంట:** మండలకేంద్రంలో చిన్న హనుమజ్జయంతిని పురస్కరించుకొని డప్పుచప్పుళ్లు, భక్తుల కోలాటనృత్యాల మధ్య అశ్వవాహనంపై ఆంజనేయస్వామి శోభాయాత్ర నిర్వహించారు.

**జమ్మికుంట:**జమ్మికుంట మున్సిపాలిటీలో ఉద్యోగుల సహకారంతోనే వందశాతం ప్రాపర్టీట్యాక్స్ వసూళ్లు చేయగలిగామని మున్సిపల్‌కమిషనర్ మహమ్మద్ అయాజ్ అన్నారు. శనివారం కార్యాలయంలో ఉద్యోగులను కమిషనర్ సన్మానించారు.

**గంగాధర:** మండలంలోని గర్షకుర్తిలో సీసీ రోడ్డుపనులను బీజేపీ జిల్లా కోశాధికారి వైదరామానుజం ప్రారంభించారు.

**చిగురుమామిడి:** మండలంలోని పొంబండలో పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతి ఉత్సవాల్లో భాగంగా అంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కరపత్రికను ఆవిష్కరించారు.